# డబ్బుంది, జబ్బుంది, కోరేది ఇంకేముంది!

–అవసరాల రామకృష్ణారావు

సముద్రం వైపు పరిగెడుతున్న గోవిందాన్ని కిటికీలోంచి చూసి, మా ఆవిడ కేకేసిందిః

“ఇంకా చూస్తారేం వెళ్ళి పట్టుకోక! మళ్ళీ ఏం అఘాయిత్యం తలపెడుతున్నాడో, పరిగెత్తి ఆపండీ...”

“నలుగురూ చూస్తుండగా, ఎలాగా ఆపుతారుకదా అని, ఆత్మహత్యకి తలపెట్టే వాళ్ళంటే నాకు అసహ్యం. చావనీ వెధవని, ఇలాగైనా భూభారం తగ్గుతుంది.”

అంటూ పైకేదో అనేశాను గాని వాడు ఈనాటి ఫ్రెండా నాకు! చస్తూంటే చూస్తూ ఊరుకునేదా మా స్నేహం! వెంటనే పరిగెత్తి అడ్డుపడ్డాను.

“నా పని పూర్తి చేసుకోనియ్యి. తిరిగొచ్చి అన్నీ వివరంగా చెబుతాగా!” అన్నాడు నా చెయ్యి విదిలించుకుంటూ. ‘తిరిగొచ్చి’ ఏమిటి? అయితే ఇది ‘ఆ ప్రయత్నం’ కాదా!

అన్నిటినీ మించి – ఈ హడావిడిలో నేను మరచిపోయిన ముఖ్య విషయం గుర్తొచ్చి – మరింత సస్పెన్సు పెరిగింది నాలో. ఎట్టి పరిస్థితుల్లోనూ వాణ్ణి ముందుకు సాగనివ్వదల్చుకోలేదు. రెండు పందుల్ని అడ్డంగా నరికి నిలువుగా కుట్టినట్టు కనపడే శరీరం వాడిది. కూచుంటే లేవలేడు, లేస్తే కూచోలేడు. ఇరవై నాలుగ్గంటలూ దగ్గుతూనో, తుమ్ముతూనో తప్ప ఊహించలేం వాణ్ణి. నోరిప్పితే నీరసం, ఆయాసం, గుండెదడ... లాంటి మాటలు తప్ప మరొకటి రావు. ఉన్నట్టుండి ఎక్కడాలేని ఈ చైతన్యం ఎక్కణ్ణుంచి కొట్టుకొచ్చింది! ఇదేదో తెలుసుకోకుండా పోనిస్తానా వాణ్ణి! పక్కనున్న పార్కు వైపు దొర్లించుకు వెళ్ళి కూలదోసేసరికి నా దుంప తెగింది. “ఏంరా గోవిందూ, నిత్యం నిన్ను పీడించే రొంప మరెవరి కొంప చేరింది? బుర్రకి పట్టిన పాకుడు పోయి ఉన్నట్టుండి ఈ దూకుడు ఎక్కణ్ణుంచి కొట్టుకొచ్చింది? నీ పడిశం ఎక్కడికి పారిపోయింది? కొత్త డాక్టర్ని ఎవర్నయినా కలిశావా ఏం?”

“అవును. ఇంచు మించు అలాంటి అనుభవమే జరిగింది... నువ్వే చెప్పేవుగా కోల్డు స్పెషలిస్ట్ కోదండం గార్ని కలవమనీ!”

“చెప్పనా, అనారోగ్యం నీ ఆరాధనా దైవం! నీ నిత్య పితూరీలు భరించలేక ఈ ఫీల్డులో ఇంకో ఎక్స్‌పర్ట్‌ని సూచించాను. పోన్లే నీ బాధలు తగ్గి నీలో మళ్ళీ ఉత్సాహం పుంజుకోవడం మాలాంటి వాళ్ళకి గొప్ప రిలీఫు! అయితే కోదండంగారు నీ జలుబుకో దండం పెట్టించారన్నమాట! గుడ్!”

“ఏమైతేనేం, ఆయన సమక్షంలోనే నాకు జ్ఞానోదయమయింది. అయితే నువ్వు వూహించిన పద్ధతిలో మాత్రం కాదు!” అంటూ దొంగ వెధవ నా ఉత్కంఠని మరింత ఊపిరాడకుండా చేసేశాడు. ఇక తట్టుకోలేక రెండు చేతుల్తోనూ వాడి పీక పట్టుకున్నాను. ‘జరిగింది వెంటనే కక్కుతావా, చటుక్కున నొక్కెయ్యమన్నావా!’ అనే ధోరణిలో, వాడిక్కూడా నన్ను మించిన శ్రోత ఎవడున్నాడు గనక! డిటెయిల్డ్‌గా చెప్పుకొచ్చాడిలా...

“ఏం చెయ్యను! ఖళ్ళు ఖళ్ళున దగ్గి దగ్గి భళ్ళు భళ్ళున వాంతి చేసుకుందామన్నా కుదరని మా ఎలర్జీ బెనర్జీల బాధ మీకేం తెలుస్తుంది! కోదండం గారు మాకు దూరపు బంధువు కూడాను. శవాన్నైనా లేపి కూచోపెట్టగల సమర్థుడని విన్నాను. సినిమా వాళ్ళయితే చర్మం దాకా మాత్రమే ఎక్స్‌పోజింగ్ చెయ్యగలరు. మా బాబాయి కోదండం లాంటి వాళ్ళయితే ఎముకలు కూడా ఏరెయ్యగల స్కానింగ్ నేర్పరులు. నిజం నీ ముందు దాచడమెందుకు, ఆ భయంతోనే ఇన్నాళ్ళూ అతని గుమ్మం తొక్కలేదు. అయినా గొంతుకలో గురగుర పద పద అని ముందుకు తోస్తూంటే ఏమైతే అయిందని ఆ ‘హాస్ప్రిజన్’లో ప్రవేశించాను”

“హాస్ప్రిజనా! అదేం మాట?”

“ఆయన ప్రైవేటు నర్సింగ్ హోంకి నేనే ఆ ముద్దుపేరు పెట్టుకున్నాను. హాస్పిటలూ ప్రిజనూ ఒకేచోట కనిపించే ప్రదేశం అది! ఇంకేం అడక్క చెప్పనియ్యి మరి... గొప్ప సెక్యూరిటీ ఉంటుంది అక్కడ. ఆ పెద్ద గేటు దాటి లోపలికి వెళ్ళామో డాక్టరుగారి అనుమతిలేందే బయటికి వెళ్ళనివ్వరు!”

“గుమ్మంలోనే వీరప్పన్ లాంటి వాచ్‌మెన్ ఒకడు కూచుని బితుకు బితుకు మంటూ అక్కడ చేరిన రోగుల్ని లోపలికి తోస్తాడు కాబోలు... మీ బాబాయి ఫీజుకి బెదిరి పరిగెత్తి పారిపోకుండా కాపలా... అవునా?”

“అలాంటిదే అనుకో... అన్నీ తెలిసే, ఏమైతే అయిందని ఈ దేహ బాధ భరించుకోలేక, మనసు చిక్కబట్టి లోపల చొరబడ్డాను. అయితే అక్కడ నాకు జరిగిన వైద్యం వేరు. బాబాయి నన్ను నోరు విప్పనిస్తేనా! ప్రేమతో పలకరించి కూచోబెట్టాడు. కాఫీ టిఫినూ ఇప్పించాడు. ఇంకేం, మొదలెట్టేశాడు!”

“అదేమిటి, నీ రోగం గురించి కదా నువ్వు చెప్పుకుందామనీ, మందు పుచ్చుకుందామనీ వెళ్ళేవ్! ఆయన చెప్పుకోడమేమిటీ!”

“నాకేం తెలుసు, నా లాంటి శ్రోత కోసం ఆయన ఎంతోకాలంగా తహతహలాడుతున్నాడని! అందులో సాటి బంధువు దొరికితే తమాయించుకోడం ఆయన తరమా!”

“ఇంతకీ ఆయన నిన్ను కూచోబెట్టుకుని, చెప్పుకున్నదేవిటీ?”

“అదే వినుమరి!” అంటూ గోవిందం ‘త్రేపు’ రికార్డరు ఆన్‌చేశాడు.

✦✧✦

కోదండంః “ఎవరూ, గోవిందమే! ఏం నాయనా దారితప్పి వచ్చేవు! ఇవాళ ఏమి మా అదృష్టం! డాక్టర్లందరూ తెగ సంపాదించేసి ఆయురారోగ్యాలతో తులతూగుతూ ఉంటారని మాయలోకం భ్రమపడుతూ ఉంటుంది. మా బాధలు మాకూ ఉంటాయని గ్రహించడం మంచిది. ఇప్పుడు కాఫీ, టిఫినూ యిక్కడపెట్టి అలా వెళ్ళింది ఎవరనుకున్నావ్, మా రెండో అమ్మాయ్ సుబ్బులు – మనల్ని ఎగాదిగా చూసి వెళ్ళింది, నువ్వు గమనించావో లేదో...”

గోవిందంః “చూసి వెళ్ళింది కాబోలునండి...”

కోదండంః “అదిగో అక్కడే ఉంది వింత అంతా... ఎంత పొరపాటు పడ్డావోయ్! దాని రెండు కళ్ళూ నిక్షేపంలా ఉన్నాయనుకుంటున్నావ్ కదూ, ఎంత పొరపాటోయ్, ఎడం వైపుది పూర్తిగా గాజుకన్ను సుమా! ఇరవై వేలు మనవి కావనుకొని కౌలాలంపూర్ నుంచి తెప్పించి ఇవి ఫిక్స్ చేయించాను. డబ్బుకి చూసుకోని మనిషిని కదా, పెళ్ళి కావలసిన పిల్లని అలా వదిలేస్తానా!”

“పోన్లెండి నన్నొదిలెయ్యండి చాలు!”

“ఇన్నాళ్ళకు కంట పడ్డావు. అంత సుళువుగా వదలగలనా, కష్టం, సుఖం చెప్పుకోందే! ఇంతకీ మా పెద్దాడు బాబ్జీ గురించి నీకు చెప్పనేలేదు కదూ! రితిక్ రోషన్‌లా తయారయ్యాడేమో, చూసిన వాళ్ళందరికీ కన్ను కుట్టినట్టుంది. ఊరికే పోతుందా దారుణమైన దిష్టిదెబ్బ! స్కూటర్ యాక్సిడెంట్‌లో వెన్ను దెబ్బతింది. మగతనమే కోల్పోయే మహా గొప్ప చిక్కు వచ్చి పడిందయ్యా! అయినా కన్నీళ్ళు తుడుచుకుంటూ, నీళ్ళు నవులుకుంటూ గడిపే మనిషిని కాదే నేను! స్టేట్సు తీసికెళ్ళేను. యాండ్రాలజిస్టు చేత సర్జరీ చేయించాను. ఇప్పుడు వాడెలా తయారయాడనుకున్నావ్, ఇలా ఎదుట పడితే చాలు వస్త్రాపహరణం చెయ్యమని గోలపెట్టని గోపిక లేదనుకో”

గోవిందంః “ఆ గోపికల గోల వినే ఓపిక నాకు లేదు. నేనెందుకొచ్చానో అది చెప్పనివ్వండి మరి”

కోదండంః “చెప్పడానికి మీకేనా? చింతలూ చికాకులూ అనేవి రోగులకేనా, డాక్టర్లకి ఉండవా! మా చెల్లి సుందరమ్మకి ఏం జరిగిందో వింటే నువ్వు మళ్ళీ మళ్ళీ చెప్పమని బతిమాలతావు. సరేనా? స్టౌ ప్రమాదంలో చిక్కుకుని ఆవిడ మొహం వంకాయలా ఉడికిపోయింది. ఎలాగో ఆర్నెల్లకి బతికి బట్ట కట్టిందనుకున్నాం. అయితే ఆ మొహం? దాన్ని చూస్తూ తిన్న అన్నం లోపలికి వెళ్ళాలంటావా! నాదసలే జాలి గుండె. ఎలా ఊరుకోను! జపాన్ తీసికెళ్ళి ప్లాస్టిక్ సర్జరీ చేయించాను. ఎన్ని వందల కుట్లు పడ్డాయో, ఎన్ని లక్షల నోట్లు మారాయో ఆ పరమాత్ముడికే ఎరుక. ఆ మోహం మామూలు మొహం అయిందంటే మేము నమ్మలేకపోయాం. కాలి, కుతకుత ఉడికిపోయి, ఎంత భయంకరంగా ఉండేదనుకున్నావ్ ఒకప్పుడు సుందరమ్మ మొహం!”

వర్ధనంః “ఎందుకండీ పాపం ఆ అబ్బాయిని ఎప్పటెప్పటివో చెప్పి బెదరగొడతారు? ఎదురుగుండా కళ్ళతో చూస్తే తప్ప ఏం తెలుస్తుందని! ఎలాగో అలా లేని ఓపిక తెచ్చుకుని నేనే వస్తానుండండి. అయిన వాళ్ళు కనిపించాక అన్నీ చెప్పుకోక తప్పుతుందా!”

కోదండంః “మా ఆవిడ పర్వత వర్ధనమోయ్! బంధువులంటే ఎంతగా ప్రాణం పెడుతుందో... డోలులా కనిపించినా లోపలంతా వట్టి డొలక. రావే పర్వతం, మన వాడే... నువ్వేం చెప్పినా ఏం అనుకోడు.”

వర్ధనంః “అయ్యో కర్మ... చెప్పక చెప్పక నా ఆరోగ్యం గురించే చెప్పుకోవాలా అబ్బాయ్! ఏం చెయ్యను, అయిన వాళ్ళు కనబడ్డాక నా ధోరణి ఆగదు. నా అసలు ప్రాణి ఎప్పుడో అడుగంటిపోయిందని చెబితే ఎవరు నమ్ముతారు నాయనా! తిందామంటే గుప్పెడు మెతుకులు అరగవు. పడుకుందామంటే రెప్పలు మూతపడవు. సిగ్గు విడిచి పరాయి మగాడితో ఎలా చెప్పుకోను! చెప్పకపోతే సున్నితమైన నీ మనసు ఏం గాయపడుతుందో! ఇందరి కొచ్చింది గాని నాకొచ్చింది కాదు చావు. ఎప్పుడేం చేసుకున్నానో ఇప్పుడు అనుభవిస్తున్నాను. డాక్టరుగారి పెళ్ళానికి ఆపరేషన్లేమిటనుకుంటారు. నిలువుగా, అడ్డంగా ఐమూలగా నా శరీరం మీద ఓ డజను కోతలైనా పడుంటాయి నాయనా! పేగులు పీకేశారు. ఎముకలు లాగేశారు. నరాలు తోడేశారు. కీళ్ళు ఏరేశారు. రక్తం పీల్చేశారు. ఇంకేం చేస్తారు బాబూ ఈ మాయదారి బొందిని! ఉండబట్టలేక బయటపడ్డాను గాని యమగుట్టు సుమా నాకు... ఈ నాలుగు ముక్కలూ చెప్పేసరికే నా కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళు లొటలొట లాడుతున్నాయి. వస్తా... మరోసారి రా అన్నీ వివరంగా చెబుతా... అనుకున్నాను గాని ఒక్క ముక్కా చెప్పినట్టే లేదు... వస్తానూ...

గోవిందంః నేనూ వస్తానండి.

కోదండంః సరే ఈ ఒక్క ముక్కా చెప్పి మరీ వెళ్ళు. ఇంత సేపై నోరు విడిచి నీతో మాట్లాడుతున్నాను. నా నోరు

చూస్తూనే ఉన్నావు. ఇందులో విచిత్రం ఏమిటో నీకు బోధపడనే లేదుకదూ! నా నోట్లో ఉన్నవి నిజం పళ్ళు అనుకుంటున్నావా, ఎంత వెర్రివాడివోయ్, ఎలా బతుకుతున్నావో ఏమిటో! ఇది పూర్తిగా కట్టుడు దంతాల సెట్టు సుమా, కావలిస్తే నువ్వే చూడు... ఇదిగో పెకలించి నీ చేతిలో పెడుతున్నాను. ఏమిటి అలా నిర్ఘాంతపోయావ్! ఇంకా ఏమిటి నీ ఆలోచన! శరీరంలో జీవితంలో ఎన్నెన్ని బాధలూ వేదనలూ ఉన్నా ఒక్కముక్క పైకి చెప్పుకోకుండా ఈయన ఎలా నిభాయించుకువస్తున్నాడా అని విస్తుపోతున్నావ్, కదూ!

గోవిందం: అదే, అదే ఆలోచిస్తున్నాను. అంతేకాదు. శబరి రాముడికిచ్చిన ఎంగిలి పళ్ళలో, మీరు నా చేతిలో పెట్టిన ఈ కృత్రిమ దంతాల సెట్టులో పెద్ద తేడా ఏమిటనే అంకిత భావం మీకే కాదు, నాకూ ఏర్పడింది. మన బంధువులు నలుగురికీ ఇవి చూపించి మీ గొప్పదనం వివరించాలని ఉంది. నాలుగు రోజులు ఎలాగో సర్దుకోండి.

కోదండం: మీ పోరాట పటిమా, విప్లవస్ఫూర్తీ మేం ఎరగనివి కావు. రెండో కంటికి తెలియడం మా ఆదర్శాలకి అవరోధం. అయినా నువ్వంత ముచ్చట పడుతున్నప్పుడు నిన్ను చిన్నబుచ్చడం ఎలా కుదురుతుంది చెప్పు... అలాగే కానియ్యి.

✦✧✦

అలా అన్నీ తిరగతోడి ఆఖర్న గోవిందం చెప్పిందిదీ:

"సుమారు ఓ గంట పైమాటగా వాళ్ళింట్లో గడిపాను. నేనెందుకొచ్చానో అడగలేదు. అసలు నా నోరే విప్పనివ్వలేదు. ఎంత సేపూ వాళ్ళూ వాళ్ళ కుటుంబ సభ్యుల రోగాలాపనే. ఎదురుగుండా వినికిడి శక్తిగల రెండు చెవులు దొరికాయనే అవకాశాన్ని పుణికి పుచ్చుకున్నారు గాని నేనూ ఓ మనిషిననీ నాకూ ఆలోచించే మనసు ఉంటుందనీ గ్రహించినట్టు లేదు. సెల్ఫ్ పిటీలో మునిగిపోయిన ఆ పెద్దమనిషికి ఓ స్ట్రేంజరు ముందు తన దైన్యం ప్రదర్శించడంలోని హైన్యం తెలిసినట్టు లేదు. ఆయనలా చెబుతున్నది వింటూంటే ఇంకో ప్రశ్న నాలో ఉదయించి నన్ను నానా అల్లరీ పెట్టేసింది!"

"ఏమిటది?"

"కోదండం బాబాయి కోట్లకి పడగెత్తిన మనిషి. ఎట్నుంచి ఎలా చూసినా గలగల పారే ధనప్రవాహం అతని జీవితం. ఇవి చాలక ఇంట్లో ప్రతి ఒక్కరికీ ఏదో విధమైన రోగం. ఇవి రెండూ కలుపుకుని ఆ యింటి యజమాని మురిసిపోడంలో ఆశ్చర్యమేముంది!"

"ఛ, ఏమిటా అసందర్భపు మాట? సిరి చూస్తే మురిసిపోతారు, జబ్బు సిరి కలిస్తే పరవశించిపోతారా ఎవరైనా!"

"అలా అయితే ఓసారి నీకూ మా బాబాయితో యింటర్వ్యూ ఏర్పాటు చెయ్యాలి. జీవితంలో ఆనందం కన్న ధ్యేయం ఉండదు కదా! రోగాలని వివరిస్తున్నప్పుడు ఆయన ఉల్లాసం, ఉత్సాహం, కంటి వెలుగూ చూస్తుంటే మతిపోతుంది ఎవరికైనా. పరమానందానికి పరాకాష్ఠ అనేక రకాలుగా ఉంటుంది కాబోలు!"

"ఎలా అయినా ఎక్స్‌ప్రెస్ చెయ్యనియ్యి, ఆయనా సిట్యుయేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నాడని నువ్వంటావ్, అవునా?"

"అదే కదా నేను చెప్పేది!"

"అయితే ఆ సెల్ఫ్ పిటీని నువ్వు ఆమోదిస్తున్నట్టే కదూ!"

"నో. నెవ్వర్. లోకంలో వ్యాధిగ్రస్తులు ఒక్కరే బాధితులా! రకరకాల దోపిడీలకు గురైన దుఃఖ భాజనులు ఎందరో ఉన్నారు. శరీర బాధ ఒక్కటే వేదన అనుకుంటే ఎలా! ఏమీ లేని వాళ్ళూ, అన్నీ ఉండి ఎవరూ లేని వాళ్ళూ, ఏ తప్పూ చెయ్యకపోయినా ఎంతో శిక్ష అనుభవిస్తున్న వాళ్ళూ ఎందరు లేరు! ఇలా ఆలోచిస్తూ ఉంటే నా టైం వేస్టవడం కాదు, నా లైన్ క్లియరైనట్టు తోచింది. 'నీకేం రోగం?' అని బాబాయి అడక్కపోవడమే నాకాయన చేసిన గొప్ప ఉపకారం. నా



తుమ్ములు సొమ్మసిల్లాయి. నా దగ్గులు తగ్గిపోయాయి. ఎలాంటి శరీర బాధయినా చాలా వరకు స్వయంగా పెంచుకొన్నదే. ఐదంకెల నెలజీతం అందుకుంటున్న నాకు నిత్యం మూడంకె వేసి పడుకోడానికి ఏం ముంచుకొచ్చిందట! బాబాయిలా నేనూ చేస్తే అతన్ని వేలెత్తి చూపే మనోధృతి నా కెక్కడిది! నా తప్పు నాకు తెలిసింది. ఎక్కడి జబ్బు అక్కడ వదిలిపోయింది. కొందరు డాక్టర్లయినా ఇంతటి రోగగ్రస్థులయి ఉన్నారనే స్పృహ రోగులకి ఎంత ఆరోగ్యకరం! ఉన్న జలుబు వదిలిపోడమే కాదు. నాలో కొత్త జలుబు వెలిగింది కూడా"

"అదేమిటి?"

"అందుకే కదా, ఆయనిచ్చిన పళ్ళ సెట్టు పట్టుకుని ఇలా సముద్రం వైపు పరిగెడుతున్నది. ఆ వేళకి కావాలని అలా అనేశాను గాని అతను నా చేతిలో ఉంచిన పళ్ళసెట్టు స్పర్శతో నాకేమనిపించిందో తెలుసా? దవడ బద్దలయేలా విసిరికొడదామని"

"మరిప్పుడు ఇవెందుకు తెచ్చావ్?"

"పళ్ళుంటేనే కదా మాట సరిగా పెగిలేది. నన్నింత హింస పెట్టేక తిరిగియిస్తే సెట్ చేసుకుని మరెందర్ని బలి చేస్తాడో! కొత్త సెట్టు కొనుక్కోవచ్చు. హింస అనేది కొన్నాళ్ళపాటు ఆపగల్గినా లోకోపకారమే కదా! దీన్ని సముద్రం పాలు చెయ్యనీ, చాలాసేపు వాగాను. ఇక ఆపకు" అంటూ అటు నడిచాడు. అలా చూస్తుంటే "గుండ్రాయికి కాళ్ళు వచ్చి గునగున నడిచెన్" అనే సామెత గుర్తొచ్చింది నాకు. ✿